క్లుప్తంగా

బైక్‌పై వెళ్లి.. సమస్యలు తెలుసుకుని


బైక్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుంటాల: కుంటాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేసేందుకు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి వచ్చారు. వివిధ వార్డుల్లో బైక్‌పై వెళ్లి కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తామని హామీఇచ్చారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత


నర్సరీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నిర్మల్‌టౌన్: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని సిద్దాపూర్‌లోని నర్సరీ, వాటర్ ఫిల్టర్‌బెడ్‌ను సోమవారం పరిశీలించారు. మొక్కల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. క్రమం తప్పకుండా మొక్కలకు నీరందించాలన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న విద్యార్థులు

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్‌లో సాయినాథ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఇతడు లోకేశ్వరం ఉన్నత పాఠశాలలో 1985–86 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థి. అతనితో చదివిన అప్పటి పూర్వ విద్యార్థులు సోమవారం స్నేహితుడి కుటుంబాన్ని పరామర్శించారు. తలకొంత డబ్బులను జమ చేసి సాయినాథ్ భార్యకు సోమవారం రూ.71 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. సర్పంచ్ శైలజ, పూర్వ విద్యార్థులు వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, పీఏసీఎస్ చెర్మన్ రత్నాకర్‌రావు, మాజీ సర్పంచ్ మెండె శ్రీధర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దోమల భోజన్న, కండక్టర్ రమేశ్, ప్రేమ్‌సాగర్‌రావు, మాణిక్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సురేఖ ఉన్నారు.

అదానీ కంపెనీలపై విచారణ చేపట్టాలి


ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నిర్మల్‌టౌన్: అదానీ కంపెనీలపై పార్లమెంట్‌లో కమిటీ వేసి విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విలాస్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో ఎస్బీఐ ఎదుట పార్టీ నాయకులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ షేర్ మార్కెట్‌లో అదానీ గ్రూపు రూ.10.78 లక్షల కోట్లు ఒకేరోజులో నష్టపోయిందన్నారు. అందులో పెట్టుబడి పెట్టిన ప్రభుత్వ రంగ బ్యాంకులు, జీవితబీమా సంస్థలు దివాలా తీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.ఎస్.రెడ్డి, భూక్య రమేశ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి పండుగ


పట్నం వేసి పూజలు చేస్తున్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని రాజుర గ్రామంలో సోమవారం శ్రీమహాలక్ష్మి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు చిన్నం రవి, రాజు, రవీందర్ తదితరుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం ఎదుట పట్నం వేశారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. నిర్మల్ కళాజాత బృందం సభ్యులు ఆట, పాటల రూపంలో వివరించారు. జిల్లా ఆసుపత్రి ఆర్‌ఎంవో డాక్టర్ వేణుగోపాలకృష్ణ, నిర్వాహకులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించారు..రోడ్డు మరిచారు


పుస్పూర్-బోరిగాం గ్రామాల మధ్య సుద్దవాగుపై నిర్మించిన వంతెన


వాహనదారులకు ఉపయోగంగా ఉన్న మట్టి రోడ్డు

- రాకపోకలకు ఇబ్బందులు
- రోడ్డుకు అడుగడుగునా గుంతలు
- పట్టించుకోని అధికారులు

లోకేశ్వరం: అది లోకేశ్వరం మండలంలోని పుస్పూర్ గ్రామం. ఇక్కడ మూడు వేలకు పైగా జనాభా ఉంటారు. అందరూ వ్యవసాయ ఆధారిత కుటుంబాలే. ఈ గ్రామస్తులు నిత్యం పనుల నిమిత్తం భైంసా మార్కెట్‌కు వెళ్తుంటారు. చూడడానికి మండల కేంద్రం నుంచి నియోజకవర్గ కేంద్రానికి వేసిన రహదారి పక్కనే ఈ గ్రామం ఉంది. అయినా వారికి ఎక్కువగా ఉపయోగపడే రహదారి కోసం పాతికేళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. రోడ్డు నిర్మాణం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

గ్రామాల వద్ద వంతెనల నిర్మాణం

మండలంలోని పుస్పూర్ గ్రామానికి భైంసా మండలంలోని బోరిగాం గ్రామాలకు మధ్య సుద్దవాగు ప్రవహిస్తోంది. ఈ వాగుపైనే గడ్డెన్న(కాక) ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కామోల్, పుస్పూర్, సాథ్‌గాం, అర్లి గ్రామాల వద్ద వంతెనలు నిర్మించారు. అర్లి అడ్డ రోడ్డు నుంచి లోకేశ్వరం వరకు వంతెన సమయంలో రోడ్డు నిర్మించారు. కామోల్ నుంచి వంతెన వరకు గతంలో రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. సాథ్గాం వంతెన వైపు రోడ్డు నిర్మాణానికి ఇటీవల ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రహదారిని ఏర్పాటు చేశారు. ఇక మిగిలిందల్లా పుస్పూర్ రహదారి. ఈ గ్రామస్తులు ఇప్పుడు భైంసా వెళ్లేందుకు కామోల్, దేగాంల మీదుగా ప్రయాణం చేస్తుంటారు. ఇందుకోసం వీరు 15 కి.మీ ప్రయాణించాలి. అదే వంతెన వరకు 2 కి.మీ రహదారి నిర్మిస్తే కేవలం 10 కి.మీ దూరంతో భైంసాకు చేరుకుంటారు. ఈ రహదారి నిర్మాణంతో ఈ ఒక్క గ్రామస్తులకే కాకుండా రాయపూర్‌కాండ్లీ, లోకేశ్వరం, గ్రామాల ప్రజలకు కూడా 5 కి.మీ దూరభారం తగ్గి రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. సుద్దవాగు అవతలి వైపు నంచి తారురోడ్డు వేసి ఉండడంతో 2 కి.మీ రోడ్డు కోసం పాతికేళ్లుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ఈ రోడ్లపై నిత్యం ఎంతోమంది ప్రజాప్రతినిధులు ప్రయాణిస్తున్నా రోడ్ల దుస్థితిని ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో నామమాత్రంగా మరమ్మతు నిర్వహించినా ఫలితం లేకుండ పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. మారుమూల గ్రామాల రోడ్లకు ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నా పీఆర్ రోడ్లపై సవతి ప్రేమ చూపుతోంది. ఈ విషయమై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి రోడ్డును తారుగా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భయమేస్తోంది


ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే జంకుతున్నాం. రోడ్డుపై అంతటా గుంతలు పడ్డాయి. ప్రయాణించాలంటే భయమేస్తోంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. – సుధాకర్‌రెడ్డి, ప్రయాణికుడు

ఇబ్బంది పడుతున్నాం


మా ఊరు అందరూ వ్యవసాయదారులే విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు కొనాలన్నా. పండిన పంటలు విక్రయించాలన్నా భైంసా మార్కెట్‌కు వెళ్లాలి. మా ఊరి పక్కనే సుద్దవాగుపై వంతెన ఉన్నా సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్నాం. – పోతారెడ్డి, గ్రామస్తుడు

ప్రతిపాదనలు పంపించాం

పుస్పూర్–బోరిగాం వంతెన వద్ద రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్లపై అంత గుంతలు ఏర్పడ్డాయి. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఇదివరకే ప్రతి పాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే తారు రోడ్డు పనులు ప్రారంభిస్తాం.– చందులాల్, నిర్మల్ పీఆర్ డీఈ

అటెన్షన్ ప్లీజ్..

రోడ్డుకు మరమ్మతు చేయాలి



తానూరు: జౌలా(కే) ఎక్స్‌రోడ్డు నుంచి ఖర్బాల గ్రామానికి ఉన్న బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుగుండా రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతు చేయించాల్సిన అధికారులు కేవలం మొరం పోయించి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. – ప్రశ్నించాల్సిన అధికారి: జగదీశ్, పీఆర్ ఏఈ, సెల్: 94408 36125

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి


ప్రజావాణిలో పాల్గొన్న తహసీల్దార్, అధికారులు

ఖానాపూర్: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాజమోహన్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులతో కలిసి ఆయన స్వీకరించారు. ఎంపీడీవో మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ శ్యాం సుందర్‌కు లిఖితపూర్వకంగా దరఖాస్తులు చేసుకున్నారు. వివిధ శాఖాలాధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్‌లోని శివాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారు చేయించిన ధ్వజస్తంభాన్ని గ్రామ ప్రధానవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్యన ప్రతిష్ఠాపన చేశారు. ఎంపీటీసీ కేశం లక్ష్మి, సర్పంచ్ రవి, ఉపసర్పంచ్ అశోక్, ఆలయ కమిటీ సభ్యులు కేశం రమేశ్, ఆశన్న, కేశం శ్రీనివాస్, బోడ హనుమండ్లు, రేని గంగయ్య, సురేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి ఓపీల క్యూ



నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ఆస్పత్రిలో సోమవారం ఔట్ పేషెంట్లు క్యూ కట్టారు. 818 మంది ఔట్ పేషెంట్లు చికిత్స నిమిత్తం ఇక్కడకు వచ్చారు. ఇందులో దాదాపు 200 మంది వరకు చిన్నపిల్లలు వివిధ ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చారని సిబ్బంది తెలిపారు.

ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం


మాట్లాడుతున్న రావుల రాంనాథ్

మామడ: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందని బీజేపీ పెద్దపల్లి ఇన్‌చార్జి రావుల రాంనాథ్ ఆరోపించారు. మండలంలోని మొండిగుట్ట గ్రామంలో సోమవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నా ఆచరణలో అమలు కావడం లేదన్నారు. దీంతో పంటపొలాలు ఎండిపోయి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. బీజేపీ మండల కన్వీనర్ కొరిపెల్లి లింగారెడ్డి, నాయకులు నాయుడు మురళీ, నర్సయ్య తదితరులు ఉన్నారు.

కంటివెలుగు సద్వినియోగం చేసుకోవాలి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజు

తానూరు: రెండోవిడత కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. మండలంలోని భోసి గ్రామంలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి పరిశీలించారు. ప్రభుత్వం అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు అందిస్తోందన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు శిబిరాలకు వచ్చి పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. సూపర్‌వైజర్ అబ్దుల్ ఖాసీం, వైద్యులు అవినాష్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, వైద్యశిబ్బంది, ఆశకార్యకర్తలు ఉన్నారు.

భైంసారూరల్: గ్రామప్రజలు కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాజు కోరారు. మండలంలోని ఖిర్గాం గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. మహాగాం పీహెచ్‌సీ వైద్యుడు శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గం

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని స్థానిక ముస్లిం ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఫహీమ్ అహ్మద్‌ఖాన్, జిల్లా అధ్యక్షుడిగా వసి ఉల్లాఖాన్, ఉపాధ్యక్షులుగా ఖాజాఅబ్దుల్ బసీర్, షేక్ పర్వేజ్, మీర్ వారిస్ అలీ, ప్రధాన కార్యదర్శిగా మొహమ్మద్ ముజమ్మిల్, సహాయ కార్యదర్శిగా సయ్యద్ జాహిద్ హాష్మీ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సల్మాన్ షేక్, అహ్మద్‌షా ఖాన్, కోశాధికారిగా మొహమ్మద్ అజహరుద్దీన్, ప్రచార కార్యదర్శిగా అబ్దుల్ అహద్, కార్యవర్గ సభ్యులుగా మొహమ్మద్ లిసాన్ ఉల్ హఖ్, మొహమ్మద్ అబ్దుల్ అలీమ్, సయ్యద్ రహ్మత్, సయ్యద్ సర్ఫరాజ్, అలీమ్ ఉద్దీన్, హాఫిజ్ ఖైసర్‌పాషా, మొహమ్మద్ ఫహీముద్దీన్ ఎన్నికయ్యారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఫ్తి రయిసుద్దీన్, కార్యవర్గ స భ్యుడు మొహమ్మద్ అబ్దుల్ అజీమ్ మాట్లాడారు. రాష్ట్రంలోని జర్నలిస్టులు ఐక్యంగా ఉండి తమ సమస్యలు పరిష్కారానికి కృషిచేయాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సన్మానించారు.

పుల్వామా అమరవీరులకు నివాళి

ఖానాపూర్: పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన సైనికులకు బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద అమరుల పోస్టర్‌ను నాయకులు సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిఏటా ఫిబ్రవరి 14న పుల్వామా అమరుల స్మారక దినోత్సవంగా జరుపుకోవాలన్నారు. వాలంటైన్స్ డే అనేది హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు పూర్తిగా విరుద్ధమన్నారు. ఈ సందర్భంగా వాలంటైన్స్‌డే గ్రీటింగ్స్‌ను దహనం చేశారు. నాయకులు టి.రాజశేఖర్, బొట్టు శ్రీను, జోగు లోకేశ్, ఆసం ఉదయ్, పచ్చిమట్ల శివ, మహేందర్, సందీప్, ప్రణీత్ ఉన్నారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికపై సమావేశం

ఖానాపూర్: మండలంలోని చందునాయక్ తండాలో సోమవారం గ్రామాభివృద్ధి ప్రణాళికపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యదర్శి అనిల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వచ్చే ఏడాదికిగాను గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల కోసం ప్రణాళికను రూపొందించారు.

పరామర్శ

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ సుధాకర్ తండ్రి పోశెట్టి ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని సోమవారం బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణగౌడ్ పరామర్శించారు. సర్పంచ్ రాంరెడ్డి ఉన్నారు.

కొనసాగుతున్న సప్తాహం

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ పశుపతినాథ్ ఆలయ ప్రాంగణంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖండహరి నామసప్తాహం కొనసాగుతోంది. సోమవారం రెండోరోజు నిర్వహించారు. కీర్తనాలు, గీతాపారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మెరుగైన విద్యనందిస్తాం

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి


హథ్గాంలో పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

లోకేశ్వరం: సర్కారు బడుల్లో విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తారని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మండలంలోని హథ్గాం, రాయపూర్‌కాండ్లీ, రాజూర గ్రామాల్లో మన ఊరు–మన బడిలో భాగంగా పాఠశాలల భవన నిర్మాణాల కోసం సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హథ్‌గాం పాఠశాలకు రూ.61 లక్షలు, రాయపూర్‌కాండ్లీ పాఠశాలకు రూ.78.80 లక్షలు, రాజూర పాఠశాలకు రూ.82 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. భవనాలను త్వరగా నిర్మించాలని సూచించారు. ప్రైవేట్‌కు దీటుగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మన ఊరు–మన బడిలో భాగంగా పాఠశాలలకు నిధులు మంజూరు చేసి పక్కా భవనాలు నిర్మిస్తోందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వం పాఠశాలల్లో చేర్పించాలన్నారు. జెడ్పీ మాజీ చెర్మన్ లోలం శ్యాంసుందర్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో సల్మాన్ రాజ్, ఆర్‌అండ్‌బీ డీఈ కొండయ్య, ఏఈ రఘు, వైస్ ఎంపీపీ నారాయణ్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు కల్యాణ్ ప్రకాశ్, సర్పంచులు ఎల్లన్న, వెంకట్‌రావు, శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, ఎంపీటీసీ దత్తురాం పటేల్, జయసాగర్, హెచ్‌ఎంలు చంద్రశేఖర్, దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పంపిణీ చేశారు. 92 లబ్ధిదారులకు రూ.92,10,672లను అందజేశారు.

అభివృద్ధిలో ప్రజల మనసు గెలిచిన కేసీఆర్

కుంటాల: అభివృద్ధిలో తెలంగాణ ప్రజల మనసు గెలిచిన సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కుంటాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.కోటి 60 లక్షలు వ్యయంతో ఉన్నత పాఠశాల నిర్మాణం, 30 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్లు, మురుగుకాలువలు, రూ.36 లక్షలతో నిర్మించే గజ్జలమ్మ గాలి గోపురానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కుంటాల ఇలవేల్పు గజ్జలమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని హామీఇచ్చారు. ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, సర్పంచ్ సమత, సర్పంచుల సంఘం మండల కన్వీనర్ ప్రదీప్ కుమార్, సింగిల్ విండో చైర్మన్ సట్ల గజ్జారాం, బీఆర్ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రి, డీఈ కొండయ్య, ఏఈ రఘు, నాయకులు అశోక్, జీవి రమణారావు, బుచ్చన్న, అశోక్ రెడ్డి, వెంకటేష్, మహేందర్, రమణగౌడ్, రమేశ్ పాల్గొన్నారు.

షర్మిల పాదయాత్రకు తరలిన నాయకులు

ఖానాపూర్: జనగామ జిల్లాలో కొనసాగుతున్న వైఎస్ షర్మిల పాదయాత్రకు మండలానికి చెందిన వైఎస్సార్‌టీపీ నాయకులు సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధినేత్రి షర్మిల చేపట్టిన పాదయాత్రతో కేసీఆర్ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని, అందుకే యాత్రకు పదేపదే ఆటంకం కలిగిస్తున్నారన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకునే అవకాశం లేకుండా ప్రభుత్వం నియంత పాలనను సాగిస్తుందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు షేక్ అస్గర్, నియోజకవర్గ కోఆర్డినేటర్ లోకిని రాము, మండల అధ్యక్షుడు బలగం రవీందర్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, సర్పంచ్ భోజవ్వ సోమవారం భూమిపూజ చేశారు. రూ.20 లక్షల నిధులతో భవనం పనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. లింగంపల్లిలో రూ.4 లక్షలతో కురుమ సంఘం భవనం, రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. వైస్ ఎంపీపీ ఏనుగు లింగారెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌గౌడ్, లింగంపల్లి సర్పంచ్ గంగాధర్, నాయకులు బాపురెడ్డి, నల్ల లింగారెడ్డి, లింగయ్య, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆలయాల అభివృద్ధికి కృషి

ఖానాపూర్: ఆలయాల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. పటణంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో సోమవారం ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పోచమ్మ ఆలయ అభివృద్ధికి రూ.3 లక్షలతోపాటు హనుమాన్ మందిర అభివృద్ధికి రూ.5 లక్షలు మంజూరు చేస్తానని హామీఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ రాజేందర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేందర్‌రావు, కౌన్సిలర్ సంతోష్ ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

భైంసారూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ ముధోల్ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ అన్నారు. మండలంలోని హంపోలి గ్రామంలో శక్తి కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలన్నారు.

ఉపాధిహామీ పనులు ప్రారంభించండి

కుభీర్: గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ప్రారంభించాలని ఏపీవో హరిలాల్ పేర్కొన్నారు. మండలంలో సోమవారం ఆయన ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలకు వంద రోజుల పని కల్పించాలన్నారు.

డబుల్ బెడ్రూం దరఖాస్తుల స్వీకరణ

ఖానాపూర్: పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ రాజమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదివరకు దరఖాస్తు చేసిన వారితో సంబంధం లేకుండా అర్హులైన కొత్తవారి నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. సోమవారం వచ్చిన 56 దరఖాస్తులపై సంబంధిత అధికారులు తిరిగి విచారణ చేసి ఇందులో నుంచి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. కాగా ఇదే చివరి అవకాశమని ఆయన పేర్కొన్నారు.

20న మంత్రుల పర్యటన

పెంబి: ఈనెల 20న ఖానాపూర్ పట్టణానికి మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి పర్యటిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మాజీ ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల శంకర్ అన్నారు. ఎమ్మెల్యే రేఖానాయక్ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైస్ ఎంపీపీ గంగారెడ్డి, సర్పంచ్‌లు సుధాకర్, పూర్ణచందర్ గౌడ్, మహేంధర్, తానాజీ, మహేందర్, నాయకులు విలాస్, రమేశ్, శంకర్, విలాస్ ఉన్నారు.

ఘనంగా పతాక ఆవిష్కరణ

ఖానాపూర్: పట్టణంలోని బ్రహ్మకుమారీల శాఖలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ముందస్తుగా పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రాజమోహన్, ఆయాశాఖల అధికారులను వేర్వేరుగా కలిసి స్వీట్లతో పాటు బ్రహ్మకుమారీస్ జ్ఞాపికలు అందజేశారు. బ్రహ్మకుమారి సంతోషి, బీకే విద్యాసాగర్, బీకే లక్ష్మి, బీకే రత్నాకర్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ విఠలేశ్వర–రుక్మాబాయి ఆలయంలో విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం శాంతిపఠం, నిత్య మండపారాధన, కలశ స్థపాన తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. శ్రీ భగవన్ జోషి మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

బాల్యవివాహాలు చట్టవిరుద్ధం

ఖానాపూర్: బాల్యవివాహాలు చట్ట విరుద్ధమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం బాల్యవివాహాల నిర్మూలన, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ బాలికలకు ఎలాంటి సమస్యలు వచ్చినా తక్షణమే 1098 టోల్ ఫ్రీ నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలి

నిర్మల్‌రూరల్: పదో తరగతి విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకొని ముందుకు సాగాలని ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ సురేష్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో సోమవారం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మోహన్, ఉపాధ్యాయులు అమత, జయ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్‌లోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శివపార్వతుల కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సర్పంచ్ కొమ్ము శ్రీవిద్య తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మధ్యాహ్నం 12 గంటలకు ఈ కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులకు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.